క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతం


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం అష్టమి పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనఘాదేవి సమేత అనఘా స్వామికి విశేష పూజలు నిర్వహించారు. సామూహిక అనఘాష్టమి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నగరపాలక డీసీగా సతీష్‌కుమార్

కర్నూలు (టౌన్): ఏడాదిన్నరగా ఖాళీగా ఉన్న నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ పోస్టును ప్రభుత్వం భర్తీ చేసింది. వెలగపూడి ఏపీ సెక్రటేరియట్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కె.వి.సతీష్ కుమార్ రెడ్డిని నగరపాలక డిప్యూటీ కమిషనర్‌గా నియమించింది. ఈ మేరకు మంగళవారం ప్రిన్సిపల్ కార్యదర్శి కె.కన్నబాబు జీఓ 464 జారీ చేశారు.

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు


అనాథాశ్రమంలో పిల్లలకు అన్నదానం చేస్తున్న సేవా సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: కర్నూలు ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగర శివారులోని అనాథ పిల్లల శరణాలయంలో విద్యార్థుల మధ్య ఎన్టీఆర్ బర్త్‌డే కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం ఆశ్రమంలోని పిల్లలకు అన్నదానం చేశారు. సేవా సమితి సభ్యులు బైరెడ్డి పక్కిరెడ్డి, సన నరసింహ, మధు, వెంకటస్వామి, లాలు, బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు బెస్త ముఖ్య నేతల సమావేశం

కర్నూలు(అర్బన్): అఖిల భారత బెస్త మహాసభ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు ఉమ్మడి జిల్లా ముఖ్య నేతల సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర కో–కన్వీనర్ సాయి ప్రదీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని డాక్టర్ బ్రహ్మారెడ్డి ప్రజా వైద్యశాల ప్రాంగణంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. అలాగే వాటి అనుబంధ మహిళ, యువజన, విద్యార్థి, సోషల్ మీడియా విభాగాలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా బెస్తలకు రాజకీయంగా అవకాశం కల్పించడంలో ప్రభుత్వాలు అవలంబిస్తున్న వైఖరిపై సమావేశంలో చర్చించనున్నట్లు వెల్లడించారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లెలో వెలసిన ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి గుగ్గిళ్లు, భక్షాలు, పిండి వంటలు నైవేద్యంగా సమర్పించి మొక్కుకున్నారు. కొందరు భక్తులు మొక్కుబడిలో భాగంగా కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాగణం కిటకిటలాడింది.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, ఇందులో భాగంగా సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు టీచర్ నాగన్న, ఏనుగుబాల సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయం ఆవరణలో రాయలసీమ ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు సిద్దేశ్వరం అలుగు.. సీమకు వెలుగు పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మే 31న సిద్దేశ్వరం అలుగు ప్రజా సంకుస్థాపన 9వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రాయలసీమకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కాశీవిశ్వనాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, స్వామిదాసు, నరసప్ప, బతకన్న, అమ్రేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిస కావొద్దు

- మాదక ద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా 1972 నంబరుకు కాల్ చేయండి
- చెమటోడ్చి సంపాదించిన డబ్బును కుటుంబానికి వినియోగించండి
- ఈగల్ ఎస్‌ఐ సుజన్‌కుమార్


అవగాహన పోస్టర్లను ప్రదర్శిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఈగల్ ఎస్‌ఐ సుజన్‌కుమార్ సూచించారు. ఆయన మంగళవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో హమాలీలు, కార్మికులు, డ్రైవర్లు తదితరులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై నిర్వహించిన సదస్సులో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు అలవాటు పడి సంతోషకరమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రధానంగా కర్నూలు ప్రాంతంలో గంజాయి బెడద ఎక్కువగా ఉందని, ప్రతిఒక్కరూ గంజాయి, డ్రగ్‌కు దూరంగా ఉండాలన్నారు. గంజాయి పండించినా, అమ్మినా, సేవించినా, ఎగుమతి చేసినా, దిగుమతి చేసుకున్నా శిక్షార్హులేనని స్పష్టం చేశారు. గంజాయి గురించి ఎలాంటి సమాచారం ఉన్నా 1972 నంబరు కాల్ చేసి తెలియజేయాలన్నారు. చెమటోడ్చి సంపాదించిన డబ్బును కుటుంబం అభివృద్ధికి, పిల్లల చదువులకు వినియోగించాలని, డ్రగ్స్ కోసం ఖర్చు చేసి కుటుంబాలను వీధిన పడేసుకోవద్దని సూచించారు. ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ ఆదేశాల మేరకు మార్కెట్ యార్డులో అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల జోలికి వెళ్లబోమని కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ అలవాటు వల్ల కలిగే అనర్థాలను తెలిపే పోస్టర్లను విడుదల చేశారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, టీజీవీ గ్రూపు ప్రతినిధి శేషగిరి శెట్టి, ఈగల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

22న హనుమాన్ జయంతి వేడుకలు


మాట్లాడుతున్న సమితి అధ్యక్షుడు క్రిష్టన్న

కర్నూలు కల్చరల్: సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 22న హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు కె.క్రిష్టన్న తెలిపారు. ఆయన మంగళవారం వినాయక్ ఘాట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. హనుమాన్ జయంతితో పాటు ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సాయంత్రం 5.30 గంటల నుంచి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. రామాయణ పారాయణం, ధార్మిక ప్రసంగాలు, వెయ్యి మందితో హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, హిందూ బంధువులు వేడుకల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, ఉపాధ్యక్షుడు మహాబలేష్, నారాయణ రెడ్డి, కోశాధికారి మురళి, సభ్యులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జాతీయ పోటీలకు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు

కర్నూలు (టౌన్): ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న 36వ జాతీయ స్థాయి ఫెడరేషన్ కప్ హ్యాండ్‌బాల్ పోటీలకు కర్నూలు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు రియాజ్, జగదీష్, భువనేశ్వర్‌ను మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఫెడరేషన్ కప్ పోటీల్లో విజేతలుగా నిలవాలని అకాంక్షించారు.

పెద్దాసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి


సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం ఇస్తున్న సాయిప్రదీప్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అల్ట్రాసౌండ్ స్కానింగ్, రక్త పరీక్షల శ్యాంపిల్ కలెక్షన్ సెంటర్లు, సిబ్బంది సంఖ్యను పెంచాలని, గర్భిణులు, వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని హెచ్‌డీఎస్ కమిటీ మెంబర్ పీటీ సాయిప్రదీప్ మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో రోజూ కేవలం 200 మందికి మాత్రమే అల్ట్రాసౌండ్ చేస్తున్నారని, ఉదయం 10 గంటల నుంచి క్యూలో ఉంటే గానీ టోకెన్ లభించడం లేదని, మళ్లీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి క్యూలో ఉండాల్సి వస్తోందన్నారు. దీనివల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. రక్త పరీక్షల వద్ద వందలాది మంది క్యూ కడుతున్నారని, శ్యాంపిల్ సేకరణకు తగినంత మంది సిబ్బంది ఉండటం లేదన్నారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని, కౌంటర్లు పెంచాలని కోరారు.

స్కానింగ్, రక్తపరీక్షల కేంద్రాలను పెంచాలి

ఆసుపత్రిలోని న్యూ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో అల్ట్రాసౌండ్ స్కానింగ్, రక్త పరీక్షల కేంద్రాలను పెంచాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆసుపత్రికి రోజూ 1800 నుంచి 2,500 మంది రోగులు చికిత్స కోసం వస్తున్నారని, వీరి సంఖ్యకు అనుగుణంగా ల్యాబ్‌లో స్టాఫ్, పరికరాలు పెంచాలని డిమాండ్ చేశారు. రోగుల రద్దీ దృష్ట్యా శ్యాంపిల్ కలెక్షన్ సెంటర్లు కూడా పెంచాలని కోరారు. ఏ రోజు రిపోర్టు ఆ రోజు ఇస్తే రోగులు వైద్య చికిత్స పొంది వెళ్లే అవకాశం ఉందన్నారు.

ఉపాధి అవకాశాల కోసం పోరాటం


మాట్లాడుతున్న కె.శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్) : దేశంలో యువతకు ఉపాధి అవకాశాల కోసం పోరాటాలకు శ్రీకారం చుడతామని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆయన మంగళవారం సీఆర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇటీవల తిరుపతిలో జరిగిన ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు విజయవంతమైనట్లు చెప్పారు. అందులో పలు తీర్మానాలు చేశామని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పోరాటాలకు శ్రీకారం చుడతామని చెప్పారు. ఏపీ విభజన హామీలు, కడప స్టీలు ప్లాంటు, విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామన్నారు. బీజేపీ పాలనలో దేశంలో వైషమ్యాలు పెచ్చుమీరుతున్నాయని, కులం, మతం పేరుతో విభజన చేస్తుండడంతో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. నాయకులు నాగరాజు, బీసన్న, కృష్ణ, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

రక్తపోటుపై అవగాహన కలిగి ఉండాలి


సంచార చికిత్స కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రఘు

కర్నూలు(హాస్పిటల్): రక్తపోటుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. ఆయన మంగళవారం కర్నూలు మండలం పడిదెంపాడు గ్రామంలో నిర్వహిస్తున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రక్తపోటుపై అవగాహన లేక, సరైన సమయంలో వ్యాధిని గుర్తించకపోవడంతో అనేక మంది ఈ వ్యాధిబారిన పడుతున్నారని, రక్తపోటు ఉన్న వారికి కొందరికీ ఎలాంటి లక్షణాలు కనిపించవన్నారు. రక్తపోటులో.. చిన్న విషయాలకే ఎక్కువగా ఆందోళన చెందడం, ఎదుటి వారిపై అరవడం, ఉద్వేగానికి లోనవడం, ముక్కులో రక్తస్రావం, ఛాతిలో బరువు, నొప్పి, మాటలు తడబడటం, చెమట పట్టడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. క్రమబద్ధమైన నడక, చక్కని వ్యాయామం చేయాలని, తరచూ రక్తపోటు పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వైద్యులు అబ్దుల్ అనిద్, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటరమణ, పర్యవేక్షకులు నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు కళావతి పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు

కర్నూలు(సెంట్రల్): కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎం.సుంకన్న, ఎస్.మునెప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ఆయా సంఘాల ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌ల రద్దుకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కోడ్‌లు ఉద్యోగ భద్రతను నిర్వీర్యం చేసి సామాజిక భద్రతకు విఘాతం కలిగించే అవకాశం ఉందన్నారు. యజమానులకు అపరిమిత హక్కులు రావడంతో కార్మికులను దెబ్బ తీసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, మోదీన్‌బాషా, షేక్షావలి పాల్గొన్నారు.

ప్రకాశం విగ్రహానికి అవమానంపై ఖండన

కర్నూలు(హాస్పిటల్): నెల్లూరు నగరంలో మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జరిగిన అవమానాన్ని ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటరామరాజు, రాష్ట్ర నాయకులు దేశాయ్ కృష్ణమూర్తి, ఎం.కె. నాగరాజు, జిల్లా అధ్యక్షుడు వసంతకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వర్ధంతి రోజు అక్కడ నివాళులర్పించడానికి వెళ్లిన బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య నాయకులకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేయకపోగా, అసాంఘిక కార్యక్రమాలు జరగడాన్ని గుర్తించారన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి పొరపాటు జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

23న లలితా సుందరేశ్వర స్వామి కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్: కర్నూలు ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో లలితా సుందరేశ్వర స్వామి దశమ ప్రతిష్ఠాపన వార్షికోత్సవం పురష్కరించుకొని ఈనెల 23న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. సాయంత్రం 6 గంటలకు లలితా సుంద రేశ్వరర స్వామివారి కల్యాణ మహోత్సవం, ఉత్సవ మూర్తులకు రథోత్సవం, ప్రత్యేక ప్రవచనం, భజన, కోలాటం కార్యక్రమాలు ఉంటాయని వెల్ల డించారు. భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

రేపు హనుమాన్ జయంతి

కర్నూలు కల్చరల్: హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం నగర శివారులోని జగన్నాథ గట్టుపై వెలసిన అభయ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు రూపాల సంగమేశ్వర జగన్నాథగట్టు అభివృద్ధి సమితి కార్యనిర్వాహక కార్యదర్శి ఇ.మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్వామివారికి పంచామృతాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, సీతారామ లక్ష్మణులకు విశేష పూజలు జరుగుతాయని తెలిపారు.

- ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో గురువారం హనుమాన్ జయంతి పురస్కరించుకొని ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పీఠం సభ్యులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పంచముఖి ఆంజనేయస్వామి సన్నిధిలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందన్నారు. అలాగే స్వామివారికి పల్లకీ సేవ, భజనలు జరుగుతాయని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో చోటు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం కార్యదర్శిగా ఎస్.విజయ్‌కుమార్‌ను నియమించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గానికి చెందిన ఆయన్ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాల్లో మంగళవారం జరిగిన సెమిస్టర్ పరీక్షలకు 265 మంది గైర్హాజరయ్యారు. 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 2378 మందికి 2135 మంది హాజరు కాగా 243 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 6వ సెమిస్టర్ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు 101 మందికిగాను 79 మంది హాజరుకాగా 22 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పెద్దకడబూరు మండలం హనుమాపురం నలందా డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఎమ్మిగనూరు శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాలకు చెందిన ఒక విద్యార్థి చూచిరాతకు పాల్పడగా గుర్తించి డిబార్ చేసినట్లు తెలిపారు.

నీటిని వృథా చేస్తే కుళాయి కనెక్షన్ కట్


బాపూజీ నగర్‌లో తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో ఎవరైనా తాగునీటిని వృథా చేస్తే సంబంధిత గృహ, వాణిజ్య సముదాయ కుళాయి కనెక్షన్లు కట్ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. ఆయన మంగళవారం బాపూజీ నగర్, పాతబస్టాండ్, సి.క్యాంపు రైతుబజార్ ప్రాంతాల్లో పర్యటించారు. బాపూజీ నగర్‌లో డ్రైనేజీ కాల్వలో సిల్ట్ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే కొందరు తాగునీటిని వృథా చేయడాన్ని గమనించిన కమిషనర్ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తాగునీటిని వృథా చేసే వారి కుళాయి కనెక్షన్లు కట్ చేయాలని అధికారులను ఆదేశించారు.

అన్న క్యాంటీన్ల పరిశీలన

నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి, కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న అన్న క్యాంటీన్లను కమిషనర్ పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి వినియోగదారులతో మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్న క్యాంటీన్ నిర్వాహకులకు సూచించారు. ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తనిఖీదారులు వలీ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ మధుసూదన్, జిల్లా ఒలింపిక్ సంఘం సభ్యులు

కర్నూలు (టౌన్): నగరంలోని బి.క్యాంపు క్రీడా మైదానంలో మంగళవారం సాయంత్రం వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నమెంటు అండర్–14 బాలబాలికల పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉన్నత విద్య అధ్యయన కేంద్రం ప్రిన్సిపాల్ కె.వి.మధుసూధన్ మాట్లాడుతూ.. చిన్నతనం నుండే విద్యార్థులకు ఇటువంటి పోటీలు నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో రాటుదేలిన క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకుంటారన్నారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యుడు షరీఫ్ అహమ్మద్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ


మాట్లాడుతున్న డాక్టర్ కె.ఇ.శ్రీనివాసమూర్తి, హాజరైన మహిళలు

కర్నూలు సిటీ: నగర శివారులోని వెంకాయపల్లె వద్ద ఉన్న రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో గ్రామీణ మహిళలకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఇ.శ్రీనివాసమూర్తి ప్రారంభించి ప్రసంగించారు. ఆర్‌ఎంజీఐటీ సొల్యూషన్స్ నేతృత్వంలో మహిళలకు తర్ఫీదు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నందనపల్లె, వెంకాయపల్లె, పసుపుల గ్రామాలకు చెందిన 100 మందికి పైగా మహిళలు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఆర్‌ఎంజీఐటీ సొల్యూషన్స్ మేనేజర్ హాఫీస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు


ఒకవైపు వాలిన విద్యుత్ స్తంభాలు

కర్నూలు(రూరల్): కర్నూలు మండల పరిధిలోని పసుపుల నుంచి పి.రుద్రవరం గ్రామానికి వెళ్లే దారిలో దర్గా సమీపాన పొలంలో విద్యుత్ స్తంభాలు ఒకవైపునకు వాలిపోయి ఎప్పుడు పడిపోతాయో అన్నట్లుగా ఉన్నాయి. రోడ్డు పక్కనే స్తంభాలు ఉండటంతో ప్రస్తుతం వీస్తున్న ఈదురు గాలులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.

రహ'దారి'ద్య్రం


అధ్వానంగా ఉన్న రోడ్డు

కర్నూలు(రూరల్): దిన్నెదేవరపాడు గ్రామ సమీపం నుంచి బి.తాండ్రపాడు పరిధిలోని ఆర్టీఓ ఆఫీసుకు వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణం చేసే వారికి నరకం కనిపిస్తోంది. ఈ రహదారిపై నిత్యం ఎంతో మంది దిన్నెదేవరపాడు నుంచి బి.తాండ్రపాడు మీదుగా నంద్యాల హైవే రోడ్డుకు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళలో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాల బారిన పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. రోడ్డును పంచాయతీరాజ్ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోపోవడంతో తారు లేచిపోయి, కంకర రాళ్లు తేలి అడుగడుగునా గుంతలు పడ్డాయి. గుంతలమయంగా మారిన రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్లానింగ్ కార్యదర్శులపై కమిషనర్ ఆగ్రహం

- షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశం


సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): సచివాలయాల్లో అందుబాటులో లేని ప్లానింగ్ కార్యదర్శులపై నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయకుండా సచివాలయం నుంచి బయటకు వెళ్లిన ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. నగరపాలక కమిషనర్ మంగళవారం పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక బి.క్యాంపులోని 56వ సచివాలయం, ఆరోరా నగర్‌లోని 57వ సచివాలయాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ప్లానింగ్ కార్యదర్శులు విధుల్లో లేకపోవడంతో ఆరా తీశారు. ఎక్కడికి వెళ్లినా మూమెంటు రిజిస్టర్‌లో రాయాలి కదా.. అని అక్కడున్న సిబ్బందిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సచివాలయాల కార్యదర్శులు జవాబుదారీతనంతో పని చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. వివిధ పనుల కోసం వచ్చే ప్రజలను పదే పదే తిప్పుకోకుండా వారి మెప్పు పొందేలా విధులు నిర్వహించాలన్నారు. ప్రతి నెలా మూడవ శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని సూచించారు.

పని చేయని చేతిపంపులు


బి.తాండ్రపాడు బీసీ కాలనీ మసీదు వద్ద నిరుపయోగంగా చేతిపంపు

కర్నూలు(రూరల్): అసలే వేసవి కాలం.. భూగర్భ జలాలు అంతత మాత్రమే.. నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన చేతిపంపులు మరమ్మతులకు గురికాగా వాటిని అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కర్నూలు మండల పరిధిలోని బి.తాండ్రపాడు బీసీ కాలనీ మసీదు సమీపాన, పసుపల గ్రామ బిల్డింగ్ కాలనీలో ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన చేతిపంపులు నిరుపయోగంగా మారాయి. ఒకప్పుడు కాలనీ వాసులు ఈ చేతిపంపుల నీటినే తాగేవారు. కుళాయిలకు నీరు సరఫరా గాకపోతే చేతిపంపుల నీరే ఆధారం. ఇదిలాఉండగా చేతిపంపులు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చుట్టుపక్కల వారి నీటి అవసరాలు, మసీదులో ప్రార్థనలకు వెళ్లే వారికి నీటి అవసరం తీర్చే చేతిపంపులను వెంటనే బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పసుపుల గ్రామంలో మరమ్మతులకు గురైన చేతిపంపు